## పూల పండుగ ప్రారంభం

### వాడవాడలా ఘనంగా బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 14 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. శనివారం మండల పరిధిలోని పోలారంతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఉత్సాహంగా కేరింతలు కొడుతూ నృత్యాలు చేస్తూ వేడుకలను నిర్వహించారు. దేశ, విదేశాల్లో బతుకమ్మ వైభవాన్ని చాటేలా తొమ్మిదిరోజుల పాటు వేడుకలను నిర్వహిస్తారు.

టేకులపల్లి, అక్టోబర్14 : తెలంగాణ సంస్కృతి సంప్రదాయలలో అతి పురాతనమైన పండుగలలో పెద్దలను కొలిచే పండుగ పెత్తరమాస ఒకటి మండల వ్యాప్తంగా పెత్తరమాస వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం టేకులపల్లి, కోయగూడెం, ముత్యాలంపాడు, సులానగర్, బొమ్మనపల్లి, బోడు, సంపత్‌నగర్, బేతంపూడి తదితర గ్రామాల్లో పెత్తరమాస పండుగ సందర్భంగా పలు కుటుంబాల్లో చనిపోయిన పెద్దల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**పూలు పంపిణీ :** బతుకమ్మ పండుగను వాడవాడలా జరుపుకుంటున్న మహిళలకు బీఆర్‌ఎస్ పార్టీ యువ నాయకుడు జాటోత్ నరేశ్ శనివారం పూలు పంపిణీ చేశారు. ప్రెగళ్లపాడు పంచాయతీ పరిధి తూర్పుగూడెంతండా, తూర్పుగూడెంలో పూలు పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలు రంగుల పూలతో బతుకమ్మగా పేర్చి ఆటపాటలతో జరుపుకొన్నారు.

# మారుమూల గ్రామాలకు విస్తరించిన రోడ్లు

- **గతుకుల రహదారులకు కాలం చెల్లింది..**
- **ఎమ్మెల్యే కృషిని అభినందిస్తున్న ప్రజలు**

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 14 : గతంలో ఇల్లెందు పల్లెలకు వెళ్లాలంటే గంటల కొద్దీ ప్రయాణం.. అతుకుల గతుకుల రహదారులతో నానా యాతనలు పడేవారు.. తెలంగాణ రాష్ట్రం వచ్చింది.. సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక అతుకుల గతుకుల రోడ్లకు కాలం చెల్లింది. ప్రస్తుతం సీసీ రోడ్లతో గ్రామాలు మెరుస్తున్నాయి.. ఇదేకాక మారుమూల ప్రదేశాలకు సైతం ఎమ్మెల్యే హరిప్రియా నాయక్ రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగున్నరేళ్ల పాలనలో సీసీ రోడ్లు, నూతన పంచాయతీ భవన నిర్మాణాలు చేపట్టారు. మండల పరిధిలోని 29 గ్రామ పంచాయతీల్లో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులను చేపట్టడంతో గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. ఇల్లెందు పట్టణంతో పాటు మండలంలోని గ్రామ పంచాయతీల్లో దాదాపు 99 శాతం రోడ్డు పనులు పూర్తయ్యాయి. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందడంతో పాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలు, వసతులు ఏర్పాటు కావడంతో గ్రామ ప్రజలు సంతోషాన్ని వెలిబుచ్చుతున్నారు.




గ్రామంలో సీసీ రోడ్డు

### అనుకున్న అభివృద్ధి జరిగింది



ఇల్లెందు మండల వ్యాప్తంగా 29 గ్రామ పంచాయతీల్లో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగింది. అభివృద్ధి కోసం మంజూరైన నిధులతో అట్టహాసంగా పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలతో పాటు పూర్తి కాని పనులకు శంకుస్థాపనలు చేశారు. దాదాపు అన్ని గ్రామ పంచాయతీలకు రోడ్డు సౌకర్యం ఏర్పాటైంది. నాలుగున్నరేళ్ల పాలనలో ఏ ఎమ్మెల్యే చేయని అభివృద్ధిని హరిప్రియ నాయక్ చేసి చూపించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలుపు ఖాయం అనడానికి ప్రజల మోములో ఉన్న సంతోషమే నిదర్శనం.

**శీలం రమేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, ఇల్లెందు**

### మెరుగుపడిన సౌకర్యాలు



గ్రామాల్లో సౌకర్యాలు, సదుపాయాలు గతంలో కంటే ప్రస్తుతం మెరుగుపడ్డాయి. 29 పంచాయతీల్లో ఎక్కడకువెళ్లినా నూతన రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు, పాఠశాలలు, ఆసుపత్రి సౌకర్యంతో పాటు ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఎమ్మెల్యే హరిప్రియనాయక్ కృషితోనే సాధ్యమైందనే చెప్పాలి. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమమే అస్త్రాలుగా ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు సిద్దంగా ఉన్నాం.

**ఖమ్మంపాటి రేణుక,**
**బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి, ఇల్లెందు**

### పల్లెల్లో బ్రహ్మండమైన రోడ్లు



ఎమ్మెల్యే హరిప్రియానాయక్ మంజూరు చేయించిన నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లతో పాటు పంచాయతీకి నూతన భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖకు ఎమ్మెల్యే ఆదేశంతో దగ్గరుండి పనుల తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. మరికొన్ని పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

**రాజు, పంచాయతీరాజ్ ఏఈ,**
**ఇల్లెందు**

# బీఆర్‌ఎస్ అధికారం చేపట్టడం ఖాయం

- **దసరా జాతరను తలపిస్తున్న చేరికలు**
- **ఎమ్మెల్యే హరిప్రియానాయక్**

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 14 : బీఆర్‌ఎస్ పార్టీలో చేరికలు దసరా జాతరను తలపిస్తున్నాయని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ అన్నారు. పోచారం, పోలారం గ్రామాల పంచాయతీలోని పోచారం, అమర్‌సింగ్‌తండా, తాండ్రి మంగ్యాతండా, ఇర్పావారి గుంపు, బద్రుతండా, పుల్యాతండా గ్రామాల్లో కాంగ్రెస్, న్యూడెమోక్రసీ (ప్రజాపంథా) పార్టీకి చెందిన 460 కుటుంబాలు వారు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారం చేపట్టడం ఖాయమని, ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తూ సీఎం కేసీఆర్ పాలన అందజేస్తున్నారన్నారు. సీసీ రోడ్లు, నూతన డ్రైనేజీలు, పంచాయతీ భవనాలు, వీధిలైట్లు తదితర వాటితో గ్రామాలకు నూతన కళ సంతరించుకున్నాయన్నారు. నవంబర్ 1న ఇల్లెందులో జరిగే సీఎం కేసీఆర్ ప్రజాశీర్వాద బహిరంగ సభకు సుమారు 75 వేల మంది జనసమీకరణ చేసి సభను విజయవంతం చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మను ఆడిపాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శీలం రమేశ్, ఖమ్మంపాటి రేణుక, వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, నాయకులు గాజీ, లష్కర్, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, పరుచూరి వెంకటేశ్వర్లు, మేకల శ్యామ్, హరికృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

## ‘కార్మికులు ఆందోళనకు గురికావొద్దు..’

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 14: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెల్లింపునకు అడ్డంకిగా మారాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ ఆర్జించిన నికర లాభాలైన రూ. 2222 కోట్ల నుంచి కార్మికులకు 32 శాతం వాటా రూపంలో రూ.711 కోట్లు చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. వీటికి సంబంధించిన వాటాను ఈ నెల 16వ తేదీన కార్మికుల ఖాతాల్లో జమ చేసేందుకు సిద్దంగా ఉంది. కానీ అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున యాజమాన్యం సింగరేణి ఎన్నికల తేదీని ప్రకటించకముందే కార్మికుల లాభాల వాటా తేదీని ప్రకటించామని, కార్మికులకు లాభాల వాటా చెల్లించేందుకు అనుమతి ఇవ్వాలని సీఎస్‌కు విన్నవించారు. ఈ నెల 16వ తేదీన కార్మికులకు లాభాలు వాటా చెల్లించకపోవచ్చని, కార్మికుల ఖాతాల్లో 32 శాతం వాటా చెల్లించేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందని, కార్మికులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని, ఎలక్షన్ కమిషన్ సానుకూలంగా స్పందించాలని జీఎం పర్సనల్ (ఐఆర్ అండ్ పీఎం) హనుమంతరావు తెలిపారు.

## రిటైర్డు క్లర్కుల నియామకాలను ఆపాలి

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 14: సింగరేణిలో రిటైర్డ్ అయిన క్లర్కులను తిరిగి నెలకు రూ.30 వేలు చెల్లిస్తూ హైదరాబాద్‌లోని సింగరేణి భవన్, గెస్ట్ హౌస్‌లలో నియమించుకోవడాన్ని నిలుపుదల చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి మందా నరసింహారావు డిమాండ్ చేశారు. సింగరేణి ఒక పక్క నిధుల ఆదా పేరుతో రకరకాల పని ప్రాంతాల్లో మ్యాన్ పవర్ తగ్గిస్తున్నారని, ఉన్న వారిపై పని భారం పెంచుతున్నారని, మరోపక్క తమ కిష్టమైన రిటైర్డ్ కార్మికులకు వేలాది రూపాయలు చెల్లిస్తూ తిరిగి నియమించడం తగదన్నారు. సింగరేణిలో అర్హులైన వారికి క్లర్కులుగా నియమించుకొని వారి సేవలను వినియోగించుకోకుండా 2012-13లో రిటైర్డ్ అయిన వారికి సైతం ఆ రోజు నుంచి ఈ రోజు దాకా నెలకు రూ.30 వేలు చెల్లిస్తూ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. గెస్ట్‌హౌస్ నిర్వహణకు సింగరేణి భవన్‌లో అర్హులైన అధికారులు, సూపర్‌వైజర్లు ఉన్నారని, వారంతా సమర్థవంతంగా పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం పునరాలోచన చేయాలని కోరారు.

# తెలంగాణ ఖ్యాతి బతుకమ్మ పండుగ



మహిళలతో కలిసి కోలాటం ఆడుతున్న ఎమ్మెల్యే

టేకులపల్లి, అక్టోబర్14 :తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిన పూలపండుగ బతుకమ్మ అని ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా నాయక్ అన్నారు. శనివారం టేకులపల్లి మండల కేంద్రం కోదండ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా నాయక్, జడ్పీచైర్మన్ కోరం కనకయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించి కోలాటంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బోడ సరిత,బోడ నిరోష, కోరం ఉమ, ఎంపీటీసీ జాలాది అప్పారావు, టేకులపల్లి ఉప సర్పంచ్ కె.సురేశ్, బీఆర్‌ఎస్ నాయకులు బోడ బాలు, బానోత్ రామ, ధారావత్ బాలాజీ, నాయకులు మోహన్ రావు, కృష్ణార్జున రావు, నోముల భాను చందర్, చారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

రామవరం, అక్టోబర్ 14: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు అన్నారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో కొత్తగూడెం త్రీ ఇంక్లైన్‌కు చెందిన సెక్యూరిటీ గార్డు మేక పెద్దులు, చంద్రకళ దంపతుల కుమార్తె గ్లోరీ ప్రశస్త కటాస్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నది. తన కార్యాలయంలో గ్లోరీని ఆయన శనివారం ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. బాలబాలికలు, యువతీ యువకులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కనపర్చి మంచి క్రీడాకారులుగా రాణించి పథకాలు గెలుపొందడంతో పాటు ఆరోగ్యం కాపాడుకుంటూ భవిష్యత్తులో ఎన్నో రంగాల్లో విజయాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ మాజీ క్రీడాకారులు, జిల్లా క్రీడాసంఘాల ప్రతినిధి కాశీహుస్సేన్, సెక్యూరిటీ ఆఫీసర్ డి.రమణారెడ్డి, ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి, అధికారి మదన్‌మోహన్, కోచ్ నిహారిక తదితరులు పాల్గొన్నారు.